క్లుప్తంగా

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

రేగిడి: ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు సూచించారు. ఆదివారం మండలంలోని మజ్జిరాముడుపేట, అప్పాపురం, కొమెర గ్రామాల్లో జరుగుతున్న ఫీవర్ సర్వేపై ఆయన ఆరాతీశారు. ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు కలిసి ప్రతీ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి, ఎవరైనా జ్వరపీడితులు ఉంటే వివరాలు నమోదు చేయాలని, అలాగే సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించాలని తెలిపారు.

సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించాలి

రేగిడి: డ్వాక్రా సంఘాల్లోని మహిళలంతా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం టి.మంగమ్మ కోరారు. ఆదివారం మండలంలోని వన్నలి, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస తదితర గ్రామాల్లోని డ్వాక్రా సంఘాల పనితీరుపై ఆమె ఆరాతీశారు. అనంతరం స్త్రీనిధి రుణాలు, పీఎంఈజీపీ రుణాలు పొందే విధానాన్ని తెలిపారు.

భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవనవిధానం


భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వక్తలు

రేగిడి: భగవద్గీత పఠనం ద్వారా ఉత్తమ జీవన విధానం అలవడుతుందని ఆధ్యాత్మిక వక్తలు త్రినాథరావు, ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని దేవుదళ గ్రామ గీతాశ్రమంలో పీఠాధిపతి దామోదరరావు స్వామీజీ ఆధ్వర్యంలో ఆధ్మాత్మిక సభ ఆదివారం నిర్వహించారు. స్వామీజీ మాట్లాడుతూ భగవద్గీత మానవాళి శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడుతుందని, గీతాపారాయణం మనిషి నడవడికలో మార్పు తీసుకువస్తుందని, జీవిత సత్యాన్ని గ్రహించేలా చేస్తుందన్నారు. ప్రతిఒక్కరూ భగవద్గీతను చదవాలని, అందులో సారాంశాన్ని గ్రహించి, ఉత్తములుగాజీవించాలని ఆయన కోరారు.

నేటి నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

బాడంగి: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సెకెండరీ గ్రేడ్ టీచర్లకు సోమ, మంగళవారాల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో పి.లక్ష్మణదొర ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. తొలిరోజు వాడాడ కాంప్లెక్స్‌లో 47 మంది టీచర్లతో, రెండోరోజు కోడూరులో 50 మంది టీచర్లతో ఈ సమావేశాలు ఉంటాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రతీ పాఠశాల నుంచి 50 శాతం టీచర్లు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

నేడు రంగప్పవలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

తెర్లాం: మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం గ్రామ సచివాలయం పరిధిలోని రంగప్పవలస పంచాయతీలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని గాయత్రికాలనీలో ఉన్న వేదమాత గాయత్రీదేవి ఆలయంలో లక్ష కుంకుమార్చనలు ఆదివారం నిర్వహించారు. ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని, గాయత్రి కాలనీతో పాటు మెంటిపేట, పెనుబాక, మల్లిఖార్జునకాలనీ, రాజాం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళా భక్తులు ఆలయానికి చేరుకుని, విశేష పూజలు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజలందుకున్న అయ్యప్పస్వామి

బాడంగి: స్థానిక ఉమాసోమేశ్వరాలయ ప్రాంగణంలో అయ్యప్పస్వామి ఆలయ 14వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మణికంఠ వేదమంత్రోచ్ఛరణల నడుమ అయ్యప్పస్వామికి ప్రత్యేకాభిషేకాలు, షోడశోపచార, మెట్ల పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు స్వామి అన్నప్రసాదం అందజేశారు.

పాడిరైతు సంక్షేమానికి పెద్దపీట

- అందుబాటులో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్లు
- ప్రమాదాలకు గురైన పశువులకు తక్షణ వైద్యానికి అంబులేటరీ సర్వీసులు
- పశువుల వ్యాధుల గుర్తింపునకు ల్యాబ్‌ల ఏర్పాటు
- ఒక్కో ఆర్‌బీకేలో రూ.33 వేల విలువైన మందులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న పాడి రైతాంగం


సంచార పశువైద్య వాహనం వద్దనే పశువుకు వైద్యం చేస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: పాడిరైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పాడిపశువులు అనారోగ్యానికి గురికాకుండా ఉండేందుకు అంచెలంచెలుగా చర్యలు చేపడుతోంది. రైతును రాజు చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా అన్ని గ్రామాల్లో ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలను రైతుల ముంగిటకు తీసుకువచ్చారు. దీంతో పాటు వ్యవసాయ అనుబంధ శాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలను సకాలంలో కల్పిస్తున్నారు. విత్తనం దగ్గర నుంచి పంట విక్రయం వరకు అన్ని ప్రక్రియలకు ఇప్పుడు గ్రామాల్లోని ఆర్‌బీకేలు వేదికలుగా మారాయి.

పాడిరైతుల అభివృద్ధే ధ్యేయం..

పాడిరైతుల అభివృద్ధే ధ్యేయంగా గ్రామాల్లోని సచివాలయాల్లో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్లు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వారి ద్వారా పశువులకు సోకే వ్యాధులను తెలుసుకుని, తక్షణమే సేవలు అందేలా నియోజకవర్గానికి ఓ ల్యాబ్ చొప్పున ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే ప్రమాదాలకు గురైన పశువులు, కదలలేని పశువులకు వైద్యసేవలందించేందుకు అంబులేటరీ సర్వీసులను సైతం అందుబాటులోకి తీసుకువచ్చింది. అనుకున్నదే తడవుగా పశువుల వద్దకే చేరుకుని, వైద్యసేవలందేలా నియోజకవర్గానికి రెండు సంచార వాహనాలను కేటాయించి, సేవలందిస్తోంది. ఈ వాహనాలను రైతులు సులభంగా వినియోగించుకునేలా 1962 టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా కేటాయించింది. జిల్లాలోని 510 ఆర్‌బీకేలకు రూ.1.68 కోట్లు వెచ్చించి, 108 రకాల మందులు పంపిణీ చేశారు. ఒక్కో ఆర్‌బీకేకు రూ.33 వేల విలువైన అత్యవసర మందులు సరఫరా చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ సేవలు సద్వినియోగం చేసుకోవాలి..

పాడిరైతుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలి. మూగజీవాలకు ఎటువంటి వైద్యం, చికిత్స కావాలన్నా తక్షణమే సేవలు అందిస్తున్నాం. వెటర్నరీ ల్యాబ్‌ల ద్వారా రక్త, మల, మూత్ర పరీక్షలు చేయడంతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. గ్రామ స్థాయిలోనే పాడిపశువులకు సంబంధించి, అవసరమైన అత్యవసర మందులు అందుబాటులో ఉంచాం. ఇటీవల ప్రభుత్వం సరఫరాచేసిన మందులను కూడా ఒక్కో ఆర్బీకేకు పంపిణీ చేశాం.

–వై.విశ్వేశ్వరరావు, జేడీ, పశుసంవర్ధక శాఖ, విజయనగరం.

రచనలు చరిత్రకు ఆనవాళ్లు..


పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రచయితలు చేసిన రచనలు పుస్తకాలు, గ్రంథాల రూపంలో చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచి ఉంటాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సిక్కోలు రాజకీయ చరిత్ర పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. 1920 నుంచి 2020 వరకు వందేళ్ల శ్రీకాకుళం రాజకీయాన్ని, ప్రాముఖ్యతను, ప్రముఖుల విశిష్టతను శ్రీకాకుళం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ గంటా లీలావరప్రసాద్ రచించారని తెలిపారు. ప్రతీ ప్రాంతానికి ఒక విశిష్టత ఉంటుందని, అటువంటి విశిష్టతను భావితరాలకు అందించాల్సిన బాధ్యత రచయితలపై ఉందన్నారు. పోరాటాలకు పురిటిగడ్డ అయిన శ్రీకాకుళం చరిత్రను, రాజకీయ నేపథ్యాన్ని, ప్రముఖుల బయోడేటాను పూర్తిగా సేకరించి, పుస్తకాన్ని రచించడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం, వంగర మండలాల కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, కరణం సుదర్శనరావు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, పెద్దశిర్లాం సర్పంచ్ లెంక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేటలో దోమల నివారణకు ఆదివారం ఫాగింగ్ చేపట్టారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గండ్రేటి కేసరి పర్యవేక్షణలో గ్రామంలోని ప్రతీ వీధిలో ఫాగింగ్ చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల ద్వారా ప్రబలే సీజనల్ వ్యాధుల బారిన ప్రజలు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.


శ్రీహరినాయుడుపేటలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో వివిధ రకాల పుస్తకాలు చదివించడం, బొమ్మలు వేయించడం, కథలు చెప్పించడం, రాయించడం వంటివి చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లో ప్రతీ ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమం ద్వారా ఎన్నో ఆసక్తికర అంశాలు, జ్ఞానం పెంపొందించే విషయాలు తెలుస్తాయని, విద్యార్థులంతా ఈ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి ప్రారంభం

రామభద్రపురం: మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర, అల్లుడు బడ్డుకొండ ప్రదీప్‌బాబు, కుమారుడు మజ్జి మోహిత్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఆస్పత్రి ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకురావడం చాలా ఆనందంగా ఉందన్నారు. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆస్పత్రుల్లో వనరులు కల్పించి, ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి ఎండీ విజయలక్ష్మి, బాడంగి జెడ్పీటీసీ పెద్దింటి రామారావు తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

వరినాట్లు వేయడంపై అవగాహన

రేగిడి: వరినాట్లు వేసే రైతులు ఓ క్రమపద్ధతిలో నాట్లు వేసుకుంటే ఎంతో మేలు అని మండల ఏవో జి.మురళీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని సోమరాజుపేట, ఉంగరాడ, గుళ్లపాడు, వందానపేట తదితర గ్రామాల్లో వరినాట్లు వేసే పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన తాడు ఆధారంగా వరుస క్రమంలో వరినాట్లు వేసుకోవాలని, ఇలా చేయడం ద్వారా పంటకు బాగా గాలి, వెలుతురు తగలడంతో పాటు ఎరువులు, పోషకాలు బాగా అందుతాయన్నారు. తద్వారా పంట దిగుబడి బాగా వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ పీఆర్‌పీ రమాదేవి పాల్గొన్నారు.


గుళ్లపాడు పొలాల్లో వరినాట్లు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

నీతికథలతో చిన్నారుల్లో నైతిక విలువలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న వికాస తరంగిణి కేంద్ర కమిటీ సమన్వయకర్త రమణమూర్తి తదితరులు

రాజాం: నీతికథల ద్వారా చిన్నారుల్లో నైతిక విలువలు పెంపొందించవచ్చని వికాస తరంగిణి కేంద్ర కమిటీ సమన్వయకర్త టి.టి.వి.రమణమూర్తి అన్నారు. స్థానిక పట్టణంలోని వికాస తరంగిణి కార్యాలయంలో కథల పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో మానసిక వికాసం, నైతిక విలువలు పెంపొందించేందుకు ఇటువంటి కథల పోటీలు చాలా అవసరమని రాజాం రెడ్‌క్రాస్ ప్రతినిధి కొత్త సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. అన్ని మండలాల్లో ప్రభుత్వ సెలవుల దినాల్లో ఉపాధ్యాయులు ఇటువంటి కథల పోటీలు నిర్వహిస్తే బాగుంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల సీనియర్ విభాగంలో మందరాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పురిటి అనన్య, రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని అడప హర్షిత, మందరాడ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన విద్యార్థిని పిన్నింటి జ్ఞానప్రసన్న వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించగా, ప్రైవేట్ పాఠశాలల సబ్ జూనియర్స్ విభాగంలో బట్న కావ్యనందిని, కలిశెట్టి వేదశ్రీ, ఉప్పల పార్థవి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సొంతం చేసుకోగా, సామంతుల దేదీప్యకు కన్సొలేషన్ బహుమతి వచ్చింది. ప్రైవేట్ పాఠశాలల జూనియర్స్ విభాగంలో ఉప్పల రిత్విక్‌సాయి, వియ్యపు కార్తికేయనాయుడు, పాడి సాయికీర్తనలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రాగా, కోడిపోయిన ప్రత్యూషకు కన్సొలేషన్ బహుమతి లభించింది. ప్రైవేట్ పాఠశాలల సీనియర్స్ విభాగంలో టంకాల శృతి, పురిపండా మేఘన, తూముల రుచితలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమంలో వికాస తరంగిణి రాజాం సమన్వయకర్త ఎ.నీలకంఠం, ప్రజ్ఞా వికాస సమన్వయకర్త ఎం.గణేష్, జి.అప్పలనాయుడు, జి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలికి గుడివాడ పీఠాధిపతి

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని గుడివాడ ప్రాణవాశ్రమ పీఠాధిపతి స్థైర్యానందస్వామి ఆదివారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఆలయ పునఃనిర్మాణ పనుల గురించి, అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పుల్లెల శ్రీనివాసరావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ధర్నా

బొబ్బిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ధర్నా చేపట్టింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా కార్యదర్శి చప్ప వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మడక బలరాంనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు చింతాడ రామారావు, దాసరి వెంకటాన్నాయుడు, జిల్లా కార్యదర్శి గంట సత్యనారాయణ పాల్గొని, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సత్యనారాయణకు డాక్టరేట్

బొబ్బిలి: పట్టణానికి చెందిన కళా సమాఖ్య అధ్యక్షుడు, రిటైర్డ్ వ్యవసాయ శాఖ ఏడీ కర్రి సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఆయన చేసిన కళాసేవలకు గుర్తింపుగా తమిళనాడులోని హోసూరులో ఉన్న ఆసియా అంతర్జాతీయ సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఆయనను డాక్టరేట్‌తో సత్కరించింది.


సత్యనారాయణకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న వర్సిటీ అధికారులు

జమిందారీ వ్యవస్థ రద్దు సాహసోపేత నిర్ణయం


రంగనాథంను సత్కరిస్తున్న రారవే సభ్యులు

రాజాం సిటీ: దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత చేసిన జమిందారీ వ్యవస్థ రద్దు చట్టం ఓ సాహసోపేతమైన నిర్ణయమని రాజాం రచయితల వేదిక(రా.ర.వే) నిర్వాహకులు గార రంగనాథం అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో రాజాం రచయితల వేదిక 103వ సమావేశం నిర్వహించి, 'వావిలవలస జమిందారి నాడు–నేడు' అంశంపై ఆయన కాసేపు ప్రసంగించారు. బొబ్బిలి, వావిలవలస జమిందారుల అగ్రహారాలు, దేవాదాయ భూములు, మొఖాసాలు, ఇనాం భూములన్నీ ఆయా సంస్థల నుంచి అధికారాలను రద్దు చేస్తూ రైతులను హక్కుదారులుగా చేయడమనేది విప్లవాత్మకమైన పరిణామమన్నారు. బొబ్బిలి సంస్థానంలో వావిలవలస జమిందారీ వ్యవస్థ ఏర్పడిన చరిత్ర, దాని భౌగోళిక పరిస్థితులు, ఆనాటి పాలనా అంశాలను వివరించారు. జమిందారుల రద్దు తర్వాత జమిందారులు, అగ్రహారీకులు, మొఖాసాదారులు, దేవాదాయ భూములు రైతులకు చేరిపోయాయని, అంతవరకు కౌలుదారులుగా ఉన్న కోట్లాది మంది రైతులు భూమికి హక్కుదారులయ్యారని, సామాజికమైన పెనుమార్పు సంభవించిందన్నారు. ఈ క్రమంలోనే వావిలవలస జమిందారీ, సీతారాంపురం సీతారాముల ఆలయం తదిత ర ప్రాంతాల వ్యవస్థల సామాజిక మార్పులను ఆయన వివరించారు. అనంతరం సమతం మహేశ్వ రరావు అధ్యక్షతన గార రంగనాథంను సత్కరించా రు. సమావేశంలో వేదిక సభ్యులు పి.దయానిధినాయుడు, ఎన్.గణేశ్వరరావు, ఎ.మోహనరావు పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు

రాజాం: రాజాం నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. గతంలో టీడీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పనులను పూర్తి చేయడంతో పాటు కొత్తగా మరికొన్ని అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. రాజాం మండలంలోని గుయ్యానవలస గ్రామంలో రెండు ప్రధాన వీధుల్లో సీసీ డ్రైనేజీ(కాలువ)ల నిర్మాణం చేపట్టారు. 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి మంజూరైన దాదాపు రూ.5 లక్షల వ్యయంతో నిర్మాణాలు చేపట్టినట్లు సర్పంచ్ సమతం రమేష్ తెలిపారు. గ్రామంలోని మరో రెండు వీధుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా పంపినట్లు ఎంపీడీవో బాసూరి శంకరరావు తెలిపారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రూ.13 లక్షల వ్యయంతో..

రాజాం పట్టణ పరిధిలోని గాంధీనగర్‌లో ఇటీవల కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ఆదివారం పరిశీలించారు. ఇక్కడి రోడ్డును రూ.13 లక్షల మున్సిపల్ అభివృద్ధి నిధులతో నిర్మించామని ఏఈ పి.వెంకట్ తెలిపారు.


రాజాం: గుయ్యానవలసలో కొత్తగా నిర్మించిన సీసీ కాలువ


వంగర: కింజంగిలో నిర్మాణ దశలో సీసీ కాలువ

వంగర: మండలంలోని కింజంగి గ్రామ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో దాదాపు రూ.8 లక్షల వ్యయంతో సీసీ డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి గ్రామంలోని సమస్యలను సర్పంచ్ బెజ్జిపురం వెంకటేశ్వరి, బెజ్జిపురం విజయ్‌కుమార్ తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగా, ఆ నిధులతో గ్రామ ప్రధాన వీధుల్లో సీసీ డ్రైనేజీలు నిర్మించామన్నారు. టీడీపీ హయాంలో గ్రామంలో ఒక్క వీధిలో కూడా డ్రైనేజీ నిర్మాణం చేపట్టలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు.

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామ ప్రధాన వీధిలో కొత్తగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి అక్కడి రోడ్డు సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం ద్వారా గ్రామాభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. రూ.13 లక్షల వ్యయంతో 200 మీటర్ల మేర సీసీ రోడ్డు దానికి ఇరువైపులా కాలువల నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ కరణం గోవిందరావు తెలిపారు.


రేగిడి: ఉప్పర్నాయుడువలసలో నిర్మించిన సీసీ రోడ్డు


రాజాం: సీసీ రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలిస్తున్న ఏఈ వెంకట్

గీతా మందిరంలో ఏకాదశి పూజలు

బొబ్బిలి: పూల్‌బాగ్‌లోని గీతామందిరంలో(డోలామండపం) ఏకాదశి పూజలు ఆదివారం నిర్వహించారు. శ్రీకృష్ణునికి ప్రత్యేకాభిషేకాలు చేయడంతో పాటు హోమం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మరిపి వేణుగోపా ల్ భక్తులకు అన్నదానం చేశారు.